క్లుప్తంగా

విశ్వనాథ్‌పేట్‌లో 'ఇంటింటికీ సీపీఐ'

నిర్మల్‌టౌన్: పట్టణంలోని విశ్వనాథ్‌పేట్‌లో బుధవారం ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ విధానాలతో దేశంలో వివిధ రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను ప్రజలకు కరపత్రాల రూపంలో వివరించారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ఎన్ రెడ్డి, రమేశ్, లక్ష్మణ్, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల ఫీల్డ్ విజిట్



కార్యాలయం ఎదుట అధికారులు, నేతలు

కడెం: స్వచ్ఛభారత్ మిషన్(ఎస్‌బీఎం) శిక్షణలో భాగంగా బుధవారం కడెం, దస్తురాబాద్ మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులు వివిధ అంశాల్లో ప్రగతి కనబరుస్తున్న కడెం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఫీల్డ్ విజిట్‌లో భాగంగా ఓడీఎఫ్, ఇంకుడుగుంతల నిర్మాణం తదితర అభివృద్ధి పనుల పరిశీలించారు. గ్రామ పర్యటనకు వచ్చిన కలెక్టర్ ఫీల్డ్ విజిట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం శిక్షకులు మధుమిత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో వెంకటేశ్, ఐకేపీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి

భైంసారూరల్: మండలంలోని టాక్లి గ్రామంలో బుధవారం 132వ అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంజీవ్‌పటేల్, యశ్వంత్, దళిత నాయకులు పాల్గొన్నారు.

నూతన దంపతులకు సాయం

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన పేద కుటుంబానికి చెందిన సోరపాక దీపకు ఇటీవల వివాహమైంది. బుధవారం మంత్రి ఐకేరెడ్డి పీఏ కృష్ణంరాజు–అనూజ్ఞ దంపతులు నూతన వధూవరులకు వస్త్రాలు, రూ.10 వేల విలువైన డ్రెస్సింగ్ టేబుల్‌ను కానుకగా అందించారు. కార్యక్రమంలో రమేశ్, రాజేశ్వర్, రవి, దివాకర్, రాజన్న, రాకేశ్, రాజు, భీమేశ్ తదితరులు ఉన్నారు.

'పీడీపై చర్య తీసుకోవాలి'

నిర్మల్ టౌన్: మెప్మా పీడీ సుభాష్ తమను వేధిస్తున్నాడని పలువురు మెప్మా మహిళా ఉద్యోగులు ఆరోపించారు. బుధవారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయానికి వెళ్లి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి సమస్య వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అవసరం లేకున్నా కార్యాలయానికి పిలిపించి తమను మానసికంగా వేధిస్తున్నాడని ఆరోపించారు. రాత్రివేళ మెసేజ్‌లు పెడుతూ రిప్లయ్ ఇవ్వకుంటే ఉదయం పిలిచి మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తంజేశారు. నిధులు కూడా కాజేస్తున్నాడని, తక్షణమే విచారణ జరిపి అతడిపై చర్య తీసుకోవాలని కోరారు.

త్వరలో గొర్రెలు పంపిణీ

లక్ష్మణచాంద: త్వరలో మండలంలో రెండో విడత గొర్రెలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో మొదటి విడత కింద మండలంలో 316 యూనిట్లు పంపిణీ చేశారు. రెండో విడతలో 326 యూనిట్లు అందిస్తామన్నారు. లబ్ధిదారులు తమ వాటా రూ.43,750 చెల్లించాలని సూచించారు. జెడ్పీటీసీ రాజేశ్వర్, ఎంపీడీవో మోహన్, యాదవ సంఘం జిల్లా కార్యదర్శి రాజేందర్ యాదవ్, మండల పశువైద్యాధికారి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కుంటాల: కార్మికులకు కనీస వేతనాల పెంపు, సామాజిక భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బక్కన్న, రామలక్ష్మణ్ పేర్కొన్నారు. బుధవారం కల్లూర్ బీడీ పరిశ్రమ ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో 138 మే డే పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మేడే వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైమద్, తిరుపతి, గౌస్, నారయణ తదితరులున్నారు.

దేగాంలో..

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం గోడప్రతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కమిటీ సభ్యులు వాగ్మారే మహేందర్ మాట్లాడారు. 138వ మే డే స్ఫూర్తితో కార్మికులకు కనీస వేతనాల పెంపుదల, సామాజిక భద్రత, పని గంటల తగ్గింపునకు పోరాటం చేస్తామన్నారు. వినోద్, శివకుమార్, ప్రహ్లాద్, నవీన్, సప్తగిరి తదితరులు ఉన్నారు.

ఎత్తిపోతల పథకం ఉత్తదేనా?

- మన్మద్‌లో ఆనవాళ్లు కోల్పోయిన కాలువలు
- రెండేళ్లుగా పంటలకు అందని నీరు
- చెక్‌డ్యాంలు నిర్మించి వినియోగంలోకి తేవాలంటున్న రైతులు



మన్మద్‌లో చెడిపోయిన వాల్

లోకేశ్వరం: బీడు భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం నిర్మించిన ఎత్తిపోతల పథకం నిర్వహణలోపంతో నిరుపయోగంగా మారుతోంది. లోకేశ్వరం మండలంలోని మన్మద్ గ్రామ శివారులో 2012లో అప్పటి ప్రభుత్వం రూ.8.50 కోట్లతో సుద్దవాగును ఆనుకొని ఎత్తిపోతల పథకం నిర్మించింది. రెండు 45 హెచ్‌పీలు, రెండు 110 హెచ్‌పీల సామర్థ్యంతో నాలుగు మోటార్లను బిగించింది. మరోవైపు ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఎత్తిపోతల పథకానికి రెండు ప్రధాన కాలువలను నిర్మించింది. ఈ పథకం కింద సమీపంలోని 900 ఎకరాలకు సాగునీరు అందించాలని అధికారులు నిర్ణయించారు.

నిర్వహణలోపమే శాపం..

పథకం ప్రారంభంలో ఎనిమిదేళ్లు బీడు భూములకు నీరందించి పంటలను సస్యశ్యామలం చేశారు. తర్వాత నిర్వహణలోపం రైతులకు శాపంగా మారింది. దీంతో గత రెండేళ్లుగా నిరుపయోగంగా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పథకాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు నీటి పారుదల శాఖ నిధులు మంజూరు చేయాల్సి ఉంది. మరోవైపు పథకం ద్వారా సాగునీరందించే ప్రధాన కాలువల్లో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి.

సుద్దవాగుపై చెక్‌డ్యాంలు నిర్మించాలి..

ఎత్తిపోతల పథకం పంపుహౌస్ ముందు సుద్దవాగుపై చెక్‌డ్యాం నిర్మించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. వాగుపై చెక్‌డ్యాం నిర్మిస్తే భూగర్భ జలాలు పెరిగి ఖరీఫ్‌లో పంటలకు మేలు జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. గడెన్నవాగు ఉధృతికి ఎత్తిపోతల పథకం పంపుహౌస్‌లోకి నీరు చేరడంతో మోటార్లు, విద్యుత్ తీగలు దెబ్బతింటున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి మోటార్లకు మరమ్మతులు చేపట్టి సాగునీరు అందించాలని రైతులు వేడుకుంటున్నారు.



మన్మద్‌లో ఎత్తిపోతల పథకం వద్ద రైతులు

మోటార్లు కాలిపోయాయి



ఎత్తిపోతల పథకానికి బిగించిన మోటార్లు కాలిపోయా యి. రూ.కోట్లు వెచ్చించి పథకం నిర్మిస్తే ఫలితం లేకపోయి ంది. ఆయకట్టు రైతుల ప్రయోజనం కోసం నిర్మించిన ఎత్తిపోతల పథకం ఆశయం నీరుగారిపోయింది. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కరించాలి.

– నారాయణ్, రైతు, మన్మద్

చెక్‌డ్యాం నిర్మించాలి



సుద్దవాగుపై చెక్‌డ్యాం నిర్మిస్తే పథకం పని చేయడమే కాక భూగర్భజలాలు పెరుగుతాయి. పథకాన్ని వినియోగంలోకి తీసుకొస్తే రైతుల పొలాల కు సాగునీరు అంది మేలు జరుగుతుంది. అధికారులు పథకం పునరుద్ధరించే చర్యలు చేపట్టాలి.

– రాజలింగం, ఎత్తిపోతల పథకం చైర్మన్, మన్మద్

నిధులు మంజూరవగానే మరమ్మతులు చేయిస్తాం

మన్మద్ ఎత్తిపోతల పథకం మోటార్లు కాలిపోయిన విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరవగానే లీకేజీల వద్ద, మోటార్లకు మరమ్మతులు చేపడుతాం. ఎత్తిపోతల పథకానికి నీరందించే విధంగా చెక్‌డ్యాం నిర్మించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం.

– అనిల్, టీఎస్ ఐడీసీ,డీఈ

అకాల వర్షం.. రైతులకు కష్టం



మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యం వద్ద రైతులు



పొట్టపెల్లి(కే) సమీపంలో పడిపోయిన స్తంభం

ఖానాపూర్: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పలు గ్రామాల్లో రైతులకు అపార నష్టం వాటిల్లింది. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు విక్రయించేందుకు తీసుకువచ్చిన ధాన్యం తడిసిపోయింది. అధికారులు సకాలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకనే కేంద్రానికి తెచ్చిన ధాన్యం తడిచిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామాల్లో మొక్కజొన్న, వరి, మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. అధికారులు సర్వే చేసి పరిహారం చెల్లించాలని రైతులు వేడుకుంటున్నారు.

విరిగిపడిన స్తంభాలు..

లక్ష్మణచాంద: మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. పొట్టపెల్లి(కే) గ్రామ సమీపంలో రైతుల చేన్లలో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో అటువైపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

భైంసా-నిజామాబాద్ బస్సు ప్రారంభం

భైంసాటౌన్: భైంసా నుంచి అర్లి ఎక్స్‌రోడ్, లోకేశ్వరం మీదుగా నందిపేట్, నిజామాబాద్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసును బుధవారం భైంసాలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పూజ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా డీఎం అమృత మాట్లాడుతూ రోజుకు మూడు ట్రిప్పులు (భైంసా నుంచి ఉదయం 7.10 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం 7.15గంటలకు) (నిజామాబాద్ నుంచి ఉదయం 10 గంటలకు, సాయంత్రం 4 గంటలకు) ఈ బస్సు నడుస్తుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, వైస్ చైర్మన్ జేకే పటేల్, బీఆర్‌ఎస్ నాయకులు తోట రాము, ఆర్టీసీ అధికారులు, తదితరులు ఉన్నారు.



బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని తన నివాసంలో కలిసి విన్నవించారు. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని.. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తాత్రి, పీఏసీఎస్ చైర్మన్ గజ్జారాం, మహేందర్, తాటి మహేశ్వర్, రఘు, అనిల్, సంతోశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో వికాసానికే వేసవి శిబిరాలు

నిర్మల్‌రూరల్: జిల్లాలో నిర్వహించే వేసవి శిబిరాలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సమ్మర్ క్యాంపు(వేసవి శిబిరాల)కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా మన జిల్లాలో దాదాపు 115 గ్రామపంచాయతీల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మే 1నుంచి మే 31వ తేదీ వరకు నిర్వహించే శిబిరాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంఈవోలు, సెక్టోరియల్ అధికారులు, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ రమణారావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీకి చెందిన మహ్మద్ ఖాజా తన ఫోన్‌ను డిసెంబర్‌లో పోగొట్టుకుని ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్‌ను పట్టుకొని బుధవారం ఎస్సై ఆర్.శంకర్ ఆధ్వర్యంలో బాధితుడికి అందజేశారు.

భద్రాచలం పీఠాధిపతి పూజలు

దస్తురాబాద్: విశ్వకర్మల సంఘం బలోపేతానికి సంఘ సభ్యులు కృషి చేయాలని విశ్వకర్మల గురువు భద్రాచలం పీఠాధిపతి విశ్వాత్మానంద స్వామి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని నిర్మాణంలో ఉన్న బ్రహ్మంగారి ఆలయం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మానవ హక్కుల సంఘం రాష్ట్ర చైర్మన్ మామిడాల మనోహర్, సర్పంచ్ రాజమణి, ఉపసర్పంచ్ గోపాల్, శివయ్య, మల్లేశ్‌రెడ్డి, గంగాధర్, ప్రకాశ్, లక్ష్మీనారాయణ, నర్సయ్య, సాగర్, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం ఖానాపూర్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మల్లేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు నివేదికలతో హాజరు కావాలని కోరారు.

'పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

నిర్మల్‌రూరల్: విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించిన ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నగర కార్యదర్శి జశ్వంత్ మాట్లాడుతూ సెలవులు ప్రకటించిన రెండు రోజులకే అడ్మిషన్ల ప్రక్రియకు తెర లేపినవారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. శశి తదితరులు ఉన్నారు.

'ఎల్ఈడీ'తో విద్యుత్ ఆదా

లక్ష్మణచాంద: సబ్సిడీపై అందించే ఎల్ఈడీ బల్బుల వినియోగంతో విద్యుత్ ఆదా అవుతుందని లక్ష్మణచాంద సర్పంచ్ ముత్యంరెడ్డి గ్రామస్తులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సీ–క్వెస్ట్ క్యాపిటల్ ఎస్‌జీ ఇండియా ఎల్ఈడీ వారి సౌజన్యంతో బుధవారం లక్ష్మణచాందలో ఎల్ఈడీ బల్బుల పంపిణీ ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ 7 నుంచి 15 ఓల్టుల బల్బులు కేవలం రూ.15కే మూడేళ్ల వారంటీతో అందిస్తున్నారన్నారు. ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేసి విద్యుత్ బిల్లులు తక్కువ వచ్చేలా చూసుకోవాలన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

లోకేశ్వరం: మండలంలోని రాజేశ్‌తండాలో బుధవారం భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబును అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు మోడం శంకర్ సన్మానించారు. సంఘం సభ్యులు రమేశ్, హర్ష ముత్తన్న, ఆంజనేయులు, శ్రీరాములు, నాయకులు లక్ష్మణ్‌పటేల్, పీరు పటేల్ ఉన్నారు.

కంటివెలుగు ప్రారంభం

కుంటాల: మండలంలోని అందకూర్‌లో బుధవారం జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచ్ దాసరి కిషన్, ఎంపీటీసీ మధుకర్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, వైద్యులు దామోదర్, కార్యదర్శి రమ్య ఉన్నారు.

ముధోల్: మండలంలోని ముద్గల్‌లో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ రాంచందర్ ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ అయేషా, ఎంపీటీసీ ఆత్మస్వరూప్, ఉపసర్పంచ్ ప్రవీణ్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పరామర్శ

ఖానాపూర్: మండలంలోని రాజురా గ్రామానికి చెందిన మేకల కాపరి మోహన్ పిడుగుపాటుతో మృతి చెందగా బుధవారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ పరామర్శించారు. ఈసందర్భంగా రూ.ఐదువేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం బావాపూర్(ఆర్)లో గంగన్న మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. టేకు ప్రకాశ్, రవీందర్, వీవీ రమణారావు, పవన్, మనోహర్, భీమలింగు, గణేశ్ ఉన్నారు.

యోగేశ్‌కు అవార్డు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామానికి చెందిన హనుమాన్ ఆలయ పూజారిగా పని చేస్తున్న యోగేశ్‌కు అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ బొగ్గులకుంట వేదికలో తెలంగాణ శ్రీత్రినయన సంస్కృతి కళానిలయం సేవా సంస్థ ఆధ్వర్యంలో శోభకృత్ నామ ఉగాది పురస్కరించుకొని బుధవారం నంది అవార్డు, వైదిక పురోహిత శిరోమణి అవార్డు అందుకున్నారు.

రోడ్లు ఊడ్చి వీవోఏల నిరసన

భైంసాటౌన్: వీవోఏల నిరవధిక సమ్మె జిల్లావ్యాప్తంగా కొనసాగుతోంది. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట వీవోఏలు రోడ్లు ఊడుస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షురాలు జయశీల తదితరులున్నారు.

ముధోల్: ముధోల్ బస్టాండ్‌లో వీవోఏలు రోడ్లు ఊడ్చి నిరసన వ్యక్తం చేశారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో వీవోఏలు రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు.

కడెం: మండల కేంద్రంలో వీవోఏలు రోడ్లు ఊడ్చి నిరసన వ్యక్తం చేశారు. బీఎస్పీ నాయకులు రాథోడ్ బన్సీలాల్, సాగర్, ఉదయ్ మద్దతు తెలిపారు.

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు వీవోఏల దీక్ష ఎనిమిదో రోజుకు చేరింది. లావణ్య, గంగాధర్, రవీందర్ పాల్గొన్నారు.

మామడ: ప్రభుత్వ తీరును నిరసిస్తూ మండల కేంద్రంలో వీవోఏలు రోడ్లు ఊడుస్తూ నిరసన తెలిపారు. రజిత, శ్వేత, పోతన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సోన్/కుంటాల: మండల కేంద్రంలో వీవోఏలు రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్.. కంపుకొడుతున్న ఓపెన్‌ప్లాట్లు



నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని 11వ వార్డు మైనార్టీ కాలనీలో ఓపెన్‌ప్లాట్లు చెత్తాచెదారంతో నిండిపోయి కంపు కొడుతున్నాయి. దీంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించే చర్యలు చేపట్టాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

నంబర్‌ప్లేట్ లేకుంటే వాహనాల సీజ్

భైంసాటౌన్: నంబర్‌ప్లేట్ లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామని పట్టణ సీఐ ఎల్.శ్రీను పేర్కొన్నారు. బుధవారం ఉదయం పట్టణంలోని పురాణబజార్, సిద్దార్థనగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 53 ద్విచక్రవాహనాలు, కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. వాహనదారులు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్సైలు తిరుపతి, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టణ సీఐ శ్రీను

గ్రామాల్లో రైస్‌మిల్లుల తనిఖీ

సారంగపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో రైస్‌మిల్లులను బుధవారం అదనపు కలెక్టర్ రాంబాబు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆలూరు ఎక్స్‌రోడ్డు వద్ద రైస్‌మిల్లును పరిశీలించి సీఎంఆర్ ధాన్యం వివరాలను మిల్లు మేనేజరుతో మాట్లాడి తెలుసుకున్నారు. వెంటనే సీఎంఆర్ ధాన్యం మిల్లు ఆడించి గోదాంలకు తరలించాలని సూచించారు. అనంతరం సాయినగర్, స్వర్ణ రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. నిల్వ చేసిన ధాన్యం, ప్రభుత్వం పంపించిన సీఎంఆర్ ధాన్యం వివరాలను సరిచూశారు. అనంతరం తహసీల్దార్ సంతోశ్‌రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. డీఎస్‌ఓ తనూజ, సివిల్ సప్లయ్ డీఎం, ఎంఆర్‌ఐ ముంతాజ్, తదితరులు ఉన్నారు.



స్వర్ణలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

పోలీస్‌స్టేషన్‌లో సీపీఆర్‌పై అవగాహన

ఖానాపూర్: మనిషి ప్రాణాలు కాపాడే సీపీఆర్‌పై అందరూ అవగాహన పెంచుకోవాలని వైద్యాధికారులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అధికారులు, సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ గుండె ఆగి కుప్పకూలి పోయే సమయంలో మనిషిని బతికించేందుకు సీపీఆర్ దోహదపడుతుందన్నారు. సాధారణ ప్రజలు సైతం ప్రాణరక్షణ ప్రక్రియలో శిక్షణ పొందాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది కామేశ్వర్, ఉపేందర్, జయలలిత, గంగన్న, సీఐ నారాయణ నాయక్, ఎస్సైలు శంకర్, ప్రభాకర్, రాజు ఉన్నారు.

అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.1500 విలువైన స్టడీ మెటీరియల్‌ను 65 మందికి జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ అధికారి రాజేశ్వర్‌గౌడ్ అందించారు. బుధవారం షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అభ్యర్థులు సమయం వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లత, సూపరింటెండెంట్ శ్రీదేవి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మెటీరియల్ అందిస్తున్న రాజేశ్వర్‌గౌడ్

మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలి

మామడ: వేసవిలో నర్సరీల్లోని మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని లింగాపూర్, కొరిటికల్ గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. వర్షాకాలంలో ప్రారంభించే హరితహారం నాటికి మొక్కలు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. ఏపీడీ ప్రసాద్, ఎంపీడీవో రమేశ్, ఈజీఎస్ ఏపీవో శివాజీ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలించిన ఎఫ్‌బీవో

కుంటాల: మండలంలోని అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని ఎఫ్‌బీవో హరిలత బుధవారం పరిశీలించారు. ఎండల నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా నీరు అందించాలని సిబ్బందికి సూచించారు. సర్పంచ్ కనీశ్ ఫాతీమా ఉన్నారు.



లింగాపూర్‌లో పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

30న ముగింపు సభకు తరలిరావాలి

నిర్మల్‌చైన్‌గేట్: హైదరాబాద్‌లో ఈనెల 30న డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించే స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభకు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని డీఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ రవీందర్ మహారాజ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఐబీలో సభ గోడప్రతులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఏడు శాతం ఉన్న అగ్రకులాలు రాజకీయ అధికారం చేపట్టి సమాజంలో అన్ని తమ గుప్పిట్లో పెట్టుకున్నారని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజకీయ చైతన్యవంతులైతే తప్ప తమ వారసత్వానికి సమాజంలో వాటా సాధించలేరన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ప్రవీణ్ మహారాజ్, శ్రీనివాస్ మహారాజ్, సుధాకర్ మహారాజ్, సీహెచ్. శ్రీనివాస్ మారాజులు పాల్గొన్నారు.